క్లుప్తంగా

వైద్యారోగ్య శాఖ బదిలీల్లో అక్రమాలు

మిర్యాలగూడ : వైద్యారోగ్యశాఖలో జరిగిన బదిలీల్లో అక్రమాలు జరిగాయని తెలంగాణ మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు ఆరోపించారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ సాధారణంగా అన్ని శాఖల్లో బదిలీలు జరిగేటప్పుడు తాము కోరుకున్న చోటుకు వెళ్లడానికి పైరవీలు చేయడం, డబ్బులు ముట్టచెప్పడం అక్కడక్కడ జరుగుతుందేనని కాని మొత్తం అందరిని కట్టకట్టి విసిరేసినట్లు బదిలీలు చేసి వాటిని రద్దు చేయడానికి ఒక్కొక్కరి నుంచి లక్షకు పైగా డిమాండ్ చేశారన్నారు. స్టాఫ్ నర్సులు అంత డబ్బు ఇవ్వలేక పోయారన్నారు. ఇది అతి పెద్ద బదిలీ స్కామ్ అని అన్నారు. అక్రమాల కోసమే ఈ ఎత్తుగడ ఎన్నుకున్నారన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో విచారణ జరిపి దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి



మాట్లాడుతున్న వెంకటేష్

దేవరకొండ : ప్రభుత్వం తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగంపై దృష్టి సారించాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పలు హాస్టళ్లలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తే నిరుపేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రమావత్ లక్ష్మణ్‌నాయక్, రాహుల్, శ్రవణ్, రాకేష్, మనోజ్ పాల్గొన్నారు.

శ్రీసాయి దత్తాశ్రమంలో అనఘాష్టమి వ్రతాలు



వ్రతాలు చేస్తున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రైల్వే కాలనీలో గల శ్రీసాయిదత్తాశ్రమంలో ఆదివారం అనఘాష్టమి వ్రతాలు ఘనంగా జరిగాయి. ఆలయంలో గల నాగసాయి, దత్తాత్రేయ విగ్రహాలకు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అనగాష్టమి వ్రతాలను నిర్వహించారు. ఈ వ్రతాలకు కుటుంబ సమేతంగా మహిళలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు గుండా శ్రీనివాస్, గుడుగుంట నరేందర్, మట్టయ్య, సోమన్న, పందిరి సత్యనారాయణ, జగన్నాధరావు, జానకిరాముడు, రవి కిరణ్,. విక్రం, వెంకన్న, అంజిబాబు, అరుణ, భాగ్యలక్ష్మి, పద్మ, చంద్రకళ, కళ్యాణి, భవాని, శారద తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ పార్టీ ప్రకటించే నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, 50ఏళ్లుగా పార్టీని నమ్ముకొని ఉన్న చిరుమర్రి కృష్ణయ్యకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని బీసీ సంఘాల నాయకులు మారం శ్రీనివాస్, బంటు సైదులు, రాపోలు పరమేష్, పుష్పాల సత్యం, కోల సైదులు కోరారు ఆదివారం స్థానిక బీసీ భవనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం నామినేటెడ్‌లో మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన చిరుమర్రి కృష్ణయ్య ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు పదవులు ఇవ్వడంలో వివక్షతను చూపిస్తుందన్నారు. పార్టీ పరంగా ఎంతో అనుభవం కలిగిన వారిని పార్టీ పక్కన బెట్టుతుందన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు దాసరాజు జయరాజు, అమృతం రవీంద్ర, నర్సింహాచారి పాల్గొన్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి

చందంపేట: అనారోగ్య కారణాలతో హోంగార్డు మృతిచెందాడు. ఈ ఘటన చందంపేటలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కొండపల్లి సైదులు (42) 15 సంవత్సరాలుగా చందంపేట పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. సైదులు కొంతకాలంగా కాలేయ, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఇటీవల అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందాడు. శనివారం సాయంత్రం డిశ్చార్జ్ కాగా ఇంటికి తీసుకువచ్చారు. అదే రోజు రాత్రి మళ్లీ ఆరోగ్యం క్షీణించడంతో సైదులు మృతిచెందాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.10వేలను ఆర్ఐ నరేశ్, దేవరకొండ డీఎస్పీ రవి చందంపేట ఎస్ఐ సతీష్ ద్వారా మరో 10వేలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

హాలియా : పట్టణంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 17ఏళ్ల తరువాత కలుసుకున్న విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకొని ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను, మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాగార్జున ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ గురువులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఘనంగా బోనాల పండుగ



పైలాన్‌లో బోనాలతో వస్తున్న మహిళలు

నాగార్జునసాగర్ : నందికొండ పైలాన్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక భక్తులు పోచమ్మ ఆలయంలో గొర్రెపొట్టేళ్లు, , మేకపోతులను బలిస్తూ తమ కోరికలను నెరవేర్చాలని అమ్మవారిని వేడుకున్నారు. మహిళలను అందరూ అమ్మవారి వద్దకు వెళ్లి బోనం సమర్పించారు.

బీఆర్ఏఓయూలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

మిర్యాలగూడ అర్బన్ : డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ(బీఆర్ఏఓయూ) డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మిర్యాలగూడ కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెర్నింగ్ సపోర్టు సెంటర్ కో ఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య తెలిపారు. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్‌లో సైన్స్, మాథ్స్ గ్రూప్ అభ్యర్థులు అర్హులని, పదో తరగతి తర్వాత రెండేళ్ల ఒకేషనల్ కోర్సులు చేసిన వారు కూడా అర్హులేనని, ఇంటర్ సర్టిఫికెట్ లేదా సమాన స్థాయి కలిగిన నేషనల్ ఓపెన్ స్కూల్, సొసైటీ విద్యార్హత కలిగిన వారు కూడా అర్హులేనని తెలిపారు. విద్యార్హతలు, ఫీజుల వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపర్చారని సూచించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజును చెల్లించాలని, ఆగస్టు 18లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. పూర్తి సమాచరం కోసం సెల్ 7382929640 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పక్కన ఖమ్మంపాటి శంకర్

మిర్యాలగూడ అర్బన్: గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో సర్వేలు నిర్వహించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకలకు దిశా నిర్దేశం చేశారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో పాలక ప్రాభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. గురుకుల విద్యార్థుల మరణాలు చూస్తుంటే ఆందోళన కలుగుతుందని, ప్రభుత్వాధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ ఆవేదనలపై సర్వేలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కుర్ర సైదానాయక్, వీరన్న, సంపత్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జనరల్‌బాడీ సమావేశం కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : ఆగస్టు 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో బీఎన్ హాల్‌లో నిర్వహించనున్న ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ జనరల్‌బాడీ సమావేశం కరపత్రాలను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోతుగంటి కాశి, వస్కుల భరత్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మనువాద మత ఛాందస భావాలను ఏఐఎఫ్‌డీఎస దేశ వ్యాప్తంగా వ్యతిరేకిస్తుందన్నారు. అదే విధంగా శాస్త్రీయ విద్యా విధానం కావాలని, ప్రైవేట్ యూనివర్సిటీ బిల్లులకు వ్యతిరేకంగా, ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేసి కామన్ స్కూల్ విద్యా విధానంపై అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. భవిష్యత్‌లో విద్యార్థి లోకానికి అండగా మరెన్నో ప్రగతిశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నామయకులు అనిల్, భరత్, గురుస్వామి, శివ, ఆదిత్య, సింహాద్రి తదితరులు ఉన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎల్లేష్, తదితరులు

దేవరకొండ : ఎస్సీ వర్గీకరణ సాధనకు ఆగస్టు 6న ఢిల్లీలో నిర్వహించనున్న దీక్షను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని రహదారి బంగ్లా వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గత 30ఏళ్లుగా రాజ్యాంగబద్ధంగా ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగనున్న దీక్షకు దేవరకొండ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పొట్ట మురళి, మద్దిమడుగు రవి, దర్శనం విష్ణు, అందుగుల సైదులు, వెంకటయ్య, నరసింహ, ఎర్ర విజయ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ జరపాలి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని గొల్లగూడెంలో అక్రమంగా ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపాలని బాధితురాలు బత్తుల కౌసల్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గొల్లగూడెం సర్వే నెం.256లో కేశరాజుపల్లి గ్రామ శివారులో నాలుగు గుంటల భూమిని 2023 నల్లగొండ తహసీల్దారు కార్యాలయంలో ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని తెలిపారు. భూమి పాస్ బుక్కు వచ్చి దానిపై రైతుబంధు డబ్బులు తీసుకుంటున్నానని తెలిపారు. ఆ భూమిని నల్లగొండ పట్టణానికి చెందిన ఎం. అంజయ్య, సత్తయ్య గొల్లగూడలోని ప్రభుత్వ భూమితో పాటు తమ ప్లాట్ ను కూడా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేశామని, చట్టప్రకారం చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న గోలి మధుసూదన్ రెడ్డి

నల్లగొండ టూటౌన్: గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు షరతులు లేకుండా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేసి రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. రైతాంగ సమస్యలపై మండల స్థాయిలో పోరాటం చేయాలన్నారు. సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, దప్పిలి కోటేశ్వర్ రెడ్డి, సతీష్ రెడ్డి, కట్ట వెంకటరెడ్డి, గుడుగుంట్ల సాయన్న గౌడ్, గుండా నవీన్ రెడ్డి, పాదురు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



దామరచర్ల మండలం గణేష్ పాడులో తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు.ఆదివారం దామరచర్ల మండలంలోని గణేష్‌పాడు గ్రామంలో నిర్వహించిన తీజ్ పండుగలో ఆయన డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. మహిళలు తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. గిరిజన మహిళలతో కలిసి తీజ్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే గిరిజనులతో కలిసి నృత్యాలు చేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ భార్గవ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ పట్టణంలో దోమలను నివారించి విషజ్వరాలను అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తోపాటు మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో మురుగునీటి సమస్య అధికంగా ఉన్న కాలనీలో నిత్యం డ్రైనేజీలను శుభ్రం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు శానిటైజేషన్ చేస్తూ దోమలను పూర్తిగా నివారించి, ప్రజలకు డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలకుండా కృషి చేయాలన్నారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ప్లాస్టిక్ కవర్ల నియంత్రణ, వన మహోత్సవ కార్యక్రమంతోపాటు 78వ స్వాతంత్ర్య వేడుకలను విజయవంతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలి



నల్లగొండ రూరల్ : చంద్రగిరి విల్లాస్‌లో మొక్కలు నాటుతున్న డీఎస్పీ

నల్లగొండ రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ 8 మొక్కలు నాటి పెంచాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని చంద్రగిరి విల్లాస్‌లో క్లీన్‌హోంగ్రీన్ హోం ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. జీవ కోటి మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలన్నారు. లయన్స్‌క్లబ్ నల్లగొండ కమిటీ ఆధ్వర్యంలో 300 మొక్కల పెంపకానికి బాధ్యతలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్, బాల్‌రెడ్డి, పిచ్చయ్య, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, రమణరావు, సత్యనారాయణ, నర్సింహాచార్యులు, కవిత, సైదాచారి, వీరేశం, శంకర్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించం

నల్లగొండక్రైం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించమని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి హెచ్చరించారు. శనివారం రాత్రి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని పట్టుకుని వారిపై కేసు నమోదు చేయడంతో పాటు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. పట్టుబడిన 50 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలో సీఐలు రాజశేఖర్‌రెడ్డి, డానియల్, ఎస్ఐలు సందీప్‌రెడ్డి, రాజు, శ్రీను, పాల్గొన్నారు.

కోణం ఫౌండేషన్ కృషి అభినందనీయం



హైదరాబాద్‌లో కోణం ఫౌండేషన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

నల్లగొండ రూరల్: సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ అధిక దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహించేందుకు కోణం ఫౌండేషన్ రూపొందించిన కృషి యాప్‌ను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రైతులకు భరోసా నిచ్చేందుకు కృషి యాప్ రైతులకు వెన్నుగా ఉంటుందన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి మాతృదేశంపై మమకారంతో కోణం ఫౌండేషన్‌ను స్థాపించి కృతిమ మేధస్సును ఉపయోగిస్తు కృషి పేరుతో రైతులకు అండగా ఉంటున్న సాందిప్ కోణంను అభినందించారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి పౌండేషన్ సీఈవో ఎం.వి.గోనారెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధి మహేష్, నరేష్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

మిర్యాలగూడ టౌన్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించేందుకు రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి ఆయన క్యాంపు కార్యాలయంలో సీపీఎస్ ఉద్యోగులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలనే ఆలోచన ప్రభుత్వం దృష్టిలో ఉందని, ఈ విషయంపై సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ మాట్లాడుతూ ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందిన రిటైర్డ్ సీపీఎస్ ఉద్యోగులు(ఓకేషనల్) ఎద్దు ఉపేందర్ కుటుంబానికి ఉద్యోగ, ఉపాధ్యాయుల సహకారంతో సేకరించిన డబ్బులు రూ.3లక్షలను ఆర్థికంగా అందజేశారు. తే ఉపేందర్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆగస్టు 4న చేయూత కార్యక్రమాన్ని నిర్వహించనున్నటు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులుందరు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఠాగూర్ సురేందర్‌సింగ్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోల సైదులు, నాయకులు ధర్మానాయక్, కృష్ణకాంత్, యోగేందర్, సతీష్‌కుమార్, మాలు, శంకర్, నాగయ్య, బంగారు, సుధాకర్, నర్సింహ్మా, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలి



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల ప్లాన్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం 19వ వార్డు శ్రీనివాస కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, నందీశ్వర కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల ప్లాన్‌ను పరిశీలించి మాట్లాడారు. 8 నెలల్లో పట్టణంలోని అన్ని వార్డులోని ప్రతి వీధికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ఇవి పూర్తయిన తర్వాత సీసీ రోడ్డు పనులు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం పనులు పూర్తి అయిన కాలనీల్లోని ప్రజలు మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గోగుల గణేష్‌ను సన్మానించారు.కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గోగుల రాములమ్మ, కోమటిరెడ్డి సమీరెడ్డి, యడవల్లి అంజయ్య, వెంకట్ రెడ్డి,శ్రీనివాస్, సంపత్ నాయుడు, పబ్లిక్ హెల్త్ ఏఈ నాగ ప్రసాద్, చక్రవర్తి, శివ, రంజిత్ నాయుడు, శివాజీ, అశ్విన్ నాయుడు,శివ నాయుడు పాల్గొన్నారు.

మంత్రికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

నల్లగొండ: రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి హరీష్‌రావు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్న గౌడ్ డిమాండ్ చేశారు. అయన ఆదివారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వెంకట్‌రెడ్డికి హరీష్‌రావు క్షమాపణ చెప్పకపోతే ఆయన్ను తిరగనీయమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరేటి మల్లేష్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి ఈర్ల లింగస్వామి యాదవ్, శంకర్, రాకేష్ ముదిరాజ్, అజయ్, దేవేందర్,సాయిరామ్ పాల్గొన్నారు.

పెరిక కులస్తుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

నల్లగొండ టూటౌన్: పెరిక కులస్తులు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఆదివారం నల్లగొండలోని పెరికకుల కార్యాలయ భవనంలో కుల సంఘం అధ్యక్షుడు ముత్తినేని శ్యాం సుందర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ముత్తినేని వీరయ్య, జూకూరి రమేష్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ, మల్లికార్జున రావు, నాగార్జున, మల్లేశం, రాఘవులు, కాంతారావు, నారాయణ, గోవర్ధన్ పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆయుధం !

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- వైరల్ ఫీవర్ బారిన పడుతున్న ప్రజలు
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవల కోసం వచ్చిన ప్రజలు

దేవరకొండ : ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వైరల్ ఫీవర్లు ప్రబలుతున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో ఇంటికొకరు చొప్పున జ్వరాల బారిన పడుతున్నారు. ప్రస్తుత తరుణంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విషజ్వరాలు పొంచి ఉన్నాయి. సీజనల్ వ్యాధిగ్రస్తులు, రోగులతో నిత్యం దేవరకొండలోని ప్రభుత్వ, పలు ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు పొంచి ఉండడంతో తగిన జాగ్రత్తలు పాటించాలంటున్నారు వైద్యులు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా చిన్నా పెద్దా అనే తేడా లేకుండా పలువురు వైరల్ ఫీవర్ల బారిన పడుతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో కొంతమేర పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో దోమల బెడద అధికమై విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి రోజూ 600 పైగా ఓపి నమోదు అవుతుండగా ప్రస్తుతం ప్రతి రోజూ పదుల సంఖ్యలో వైరల్ ఫీవర్ల బారిన పడుతున్న వారే ఆస్పత్రులకు వస్తున్నట్లు తెలుస్తుంది.

జాగ్రత్తలు తప్పనిసరి:
రోజు రోజుకు వైరల్ ఫీవర్లు ప్రబలుతున్న నేపథ్యంలో తగిన జ్రాత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పేర్కొంటున్నారు. దోమల బెడద నివారణకు గాను తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కాచి చల్లార్చిన మంచి నీటిని తాగడంతో పాటు వేడి వేడి ఆహారాన్ని తీసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న కాలం. ఈ క్రమంలో వైరల్ ఫీవర్ల బారిన పడకుండా ఉండేందుకు గాను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలి. అంతేగాకుండా ప్రత్యేకంగా చిన్న పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి. వైరల్ ఫీవర్ల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– డాక్టర్ రాములునాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్, దేవరకొండ